

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం,9 మే 2025

8 పేజీలు


## డిఎస్‌సి అభ్యర్థులకు

# ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభం






**ఉమ్మడిగోదావరిజిల్లాల సూర్యబ్యూరో :** కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన డిఎస్‌సి ఉచిత ఆన్లైన్ శిక్షణ తరగతులు గురువారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఆర్థిక భారం కారణంగా శిక్షణ తీసుకోలేని నిరుద్యోగ యువతను ప్రోత్సహించే లక్ష్యంతో కాకినాడకు చెందిన ప్రఖ్యాత శ్యామ్ ఇనిస్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు.ఈ మేరకు నాలుగు రోజుల క్రితం ఆన్లైన్ ద్వారా అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించగా విశేష స్పందన లభించింది.కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఏడుఅసెంబ్లీ నియోజకవర్గాల నుండి ఇప్పటివరకు సుమారు 1000 మంది అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం నమోదు చేసుకోగా,గురువారం ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ వర్చువల్ గా ఆన్లైన్ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ముందుకు రావడం అభినందనీయమన్నారు.అభ్యర్థుల నుండి వస్తున్న స్పందన దృష్టిలో ఉంచుకుని ఉచిత శిక్షణ కోసం నమోదు చేసుకునేందుకు రేపటి వరకు గడువు పొడిగించామని నిరుద్యోగ యువత ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 'అన్నా క్యాంటీన్' ఏర్పాటుకు పనులు ప్రారంభం





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో పేద వారికి కడుపునిండా అన్నం పెట్టే విధంగా రంపచోడవరం గ్రామంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ వద్ద అన్నా క్యాంటీన్ శంకుస్థాపన కార్యక్రమానికి రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీషదేవి,రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ముఖ్య అతిథులుగా హాజరై అన్న క్యాంటీన్ ఏర్పాటుకు వేదమంత్రాలతో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం శాసన సభ్యులు మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల వారికి

- తరువాయి 2లో..

# ఆపరేషన్ సిందూర్ జయహో..

**- ఉగ్రవాదం అంతం.. మోడీజీ పంతం.**

**- ఆపరేషన్ సింధూర్‌పై హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** ఉగ్రవాదాన్ని అంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోడీ పంతమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం స్థానిక రావులమ్మ నగర్‌లోని పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట చేసిన దాడులను స్వాగతించారు. ఆపరేషన్ సిందూర్ విజయంతో భారతదేశ సైనికుల సత్తా ప్రపంచానికి మరోసారి తెలిసిందని అన్నారు. టెర్రరిస్టు స్థావరాలపై మన దేశ సైనికులు చేసినదాడి దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నా రని తెలిపారు.దేశసమగ్రత, సార్వభౌమత్వంకోసం మోడీ అనుసరిస్తున్న విధానాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్

- తరువాయి 2లో..



# గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం ..

**బాధ్యత మరింత పెంచింది : కలెక్టర్ ప్రశాంతి**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పి.ప్రశాంతి పనిచేసిన సమయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలు విస్తృత స్థాయిలో ప్రచారంకల్పించడం,ప్రజా ప్రయోజనాలు నేపథ్యంలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. గురువారం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా ప్రశంసం పత్రం స్వీకరించడం జరిగింది. 2022- 23 సంవత్సరంలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించడం కోసం చేసిన కృషికి గుర్తింపుగా ప్రపంచ

- తరువాయి 2లో..

# రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా

## జిల్లా కలెక్టర్‌కు పురస్కారం





**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలోని రాజభవన్ దర్బార్ హాలులో ఏర్పాటుచేసిన ఓకార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్సిఎస్)రాష్ట్రశాఖ అధ్యక్షులు ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 రక్త దాన కేంద్రాలు నడుస్తున్నాయని

- తరువాయి 2లో..

# నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయలు వసూలు ?

**– సమగ్ర విచారణ జరపాలి**

**: కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సర్పంచ్ నవరత్న కుమారి**



**కైకలూరు,మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయితీలో నిబంధనలకు విరుద్ధంగా సర్పంచ్ అనుమతి లేకుండా గ్రామ కార్యదర్శి దిగువ సిబ్బందితో కలిసి లక్షలాది రూపాయలు వసూలు చేసిన సొమ్మును పంచాయితీ ఖాతాలో జమ చేయకుండా సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని సర్పంచ్ ధ్వజమెత్తారు. కైకలూరు గ్రామ పంచాయితీ సర్పంచ్ మేరీ నవరత్న కుమారి ఒక ప్రకటన ద్వారా ఆమె మాట్లాడుతూ గ్రామ సర్పంచిగా ది. 20 21 ఎన్నికైన దగ్గర నుండి దళిత మహిళగా ఇప్పటివరకు సక్రమంగా విధులు నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తున్నానని తెలిపారు. గ్రామ కార్యదర్శి ఆనందభూషణం బదిలీపై కైకలూరు రావడం మహిళ అని చూడకుండా పలు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేను నివాసము ఉండే రెండవ వార్డులో సుమారుగా 10 కుటుంబాలకు మంచినీటి సరఫరా నిలిపివేయడం ఇబ్బంది పెట్టటం జరిగిందన్నారు. గ్రామ కార్యదర్శి కైకలూరు గ్రామపంచాయతీ పరిధిలో నివాసం ఉండకుండా ప్రతిరోజు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నుండి విధులకు హాజరవుతున్నారని,గ్రామ సమస్యలను పట్టించుకోకుండా తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యదర్శి పై సెల్ టవర్ సిగ్నల్స్ ఆధారంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశానన్నారు. ఈ విషయంపై నూజివీడు డి ఎల్పి ఓ విచారణ అధికారిగా నియమించినారు. ఫిర్యాదు చేసిన విషయానికి సంబంధించి అంశాలను పరిగణలోకి తీసుకొని గ్రామ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా సర్పంచ్ అనుమతి లేకుండా వాటర్ వర్కర్స్ కాంట్రాక్టర్ సిబ్బందితో కలిసి పంచాయతీ పరిధిలోని ఇంటి పన్నులు, కొళాయి కలెక్షన్లు, పంచాయితీ షాపుల అద్దె లు వసూళ్లకు పాల్పడుతున్నారు. లక్షలాది రూపాయలు వసూలు చేయించి ఆ డబ్బును గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయకుండా సుమారుగా 40 లక్షల రూపాయలు పైబడి ఈవో తన సొంత ప్రయోజనాలకి ఖర్చు పెట్టుకుని నిధులు దుర్వినియోగం చేసినారు. అంతేకాకుండా ప్రహరీ గోడ నిర్మాణం, సిసి కెమెరాలు ఏర్పాటు, ఎంపీడీవో ఈవో పి ఆర్ డి రూములు రీ మోడలింగ్ జడ్పీ భవనం ప్రాంగణంలో ప్రత్యేక కట్టడం సిసి రోడ్లో రిటైనింగ్ వాల్స్ పంచాయతీ తీర్మానం లేకుండా ఏర్పాటు చేసినారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి కార్యదర్శిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినారు.

## ఆపరేషన్ సిందూర్ జయహో..

**మొదటిపేజి తరువాయి**

సింధూర్ దాడులతో ఉగ్రవాదులకు భారత్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిందని అన్నారు. ఉగ్రవాదం ఏ స్థాయిలో ఉన్న అణచివేసేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని తెలిపారు. పహల్గాం కిరాతక దాడి దేశ ప్రజలను కలచివేసిందని, కిరాతక ఉగ్రవాదులను అణచివేసే దిశగా ప్రభుత్వం దాడులు నిర్వహించటం అభినందనీయమన్నారు. అమాయకులపై దాడి చేసిన ఉగ్రవాదులను, అంతమెందించేలా భారత్ చేసిన దాడులకు ప్రపంచ దేశాలన్నీ మద్దతు తెలపటం, దేశానికే గర్వకారణం అన్నారు.

సాధారణ పౌరులకు హాని కలిగించకుండా దాడులు చేసి ముష్కరులకు సరైన సమాధానం ఇచ్చిందని తెలిపారు. ఉగ్రవాదుల స్థావరాలపై ప్రజలకు హాని కలగకుండా ఖచ్చితమైన ప్రాంతాల్లో దాడులు చేయడం మన దేశ టెక్నాలజీ, శక్తి సామర్థ్యాలు ప్రపంచ దేశాలకు తెలిశాయని అన్నారు.

ప్రజల మధ్య విభేదాలు సృష్టించి దేశంలో అంతర్గత కలహాలు సృష్టించాలని ప్రయత్నించిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను భారత ప్రజలు కుల మతాలకతీతంగా సమైక్యంగా ఆపరేషన్ సింధూరతో తిప్పి కొట్టారని తెలిపారు.

ఈ సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీనుమణి బాబు, అన్నవరం రిటైర్డ్ పి ఆర్ ఓ తులా రాము, బోదిరెడ్ల సుబ్బారావు, మండపాక అప్పన్న దొర, బండారు నాని తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం ..

**మొదటిపేజి తరువాయి**

రెడ్‌క్రాస్‌దినోత్సవాన్ని పురస్కరించు కొని అవార్డ్ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒకసందేశం ఇస్తూ, తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రెడ్ క్రాస్ కార్యక్రమాలను చేపట్టడం, సభ్యత్వ నమోదు విషయం ప్రత్యేకంగా దృష్టి పెట్టడం జరగాలనీ కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున చేపట్టడం ద్వారా మరింత సమర్ధవంతంగా కార్యక్రమాలు చేపట్టడం సాధ్యం అవుతుందని తెలిపారు.. ముఖ్యంగా యూత్ రెడ్ క్రాస్ సభ్యులుగా విద్యార్థులు చేర్పించడం కోసం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ఒక వేదికగా చేసుకోవాలని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్‌కు పురస్కారం

**మొదటిపేజి తరువాయి**

అందులో ప్రతి సంవత్సరం 65 వేల రక్త యూనిట్లు పైగా సేకరించడం జరుగుతుందన్నారు. ఇందులో నుంచి అవసరం ఉన్న ప్రజలకు లక్షకు పైగా యూనిట్ల రక్తం ఇవ్వడం జరుగుతుందని,అందులో మూడవ వంతు యూనిట్లు ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందే పేద రోగులకు ఉచితంగా సరఫరా చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ రెడ్ క్రాస్ ద్వారా విశిష్ట సేవలు అందించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలికి బంగారు పతకము, పురస్కారం అందజేసి అభినందించారు. జిల్లాలో రెడ్ క్రాస్ సేవలు విస్తృతంగా అందించుటకు నిరంతరం రెడ్ క్రాస్ జిల్లా కమిటికి దిశానిర్దేశాలు చేస్తూ ముందుకు నడపడం విశేషం. కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అందుకున్న ఈ అవార్డు, జిల్లాకే గర్వకారణం. రాష్ట్రవ్యాప్తంగా మానవతాసేవాకార్యక్రమాల బలోపేతానికి కృషిచేస్తున్న వారికి ఈ అవార్డు విశిష్ట గుర్తింపుగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రథమ మహిళ సమీరా నజీర్,గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం.హరి జవహర్లాల్, ఐఆర్‌సిఎస్ చైర్మన్ వై.డి.రామారావు,రెడ్ క్రాస్ ఆంధ్రప్రదేశ్ శాఖసీఈవో,ప్రధానకార్యదర్శి ఏకేఫరీదా, రాజభవన్ సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టాలుపై ట్రాన్స్ జెండర్లు అవగాహన కలిగి ఉండాలి






**– ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : న్యాయ సేవాధికారి**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతివారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనం నందు ట్రాన్స్ జెండర్స్ కు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి చట్టాలపైన అవగాహన కలిగించాల్సిన బాధ్యత న్యాయ సేవాధికార సంస్థలపైన ఉందని,అందులో భాగంగా గురువారం ట్రాంజెండర్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించామని తెలియజేశారు. సమాజంలో స్త్రీ, పురుషులతో సమానంగా ట్రాన్స్ జెండర్స్ కూడా సమాన హక్కులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని,అందరితో సమానంగా సంక్షేమ పథకాలను అందించాలని సూచించారు.వీరికి వసతి,రేషన్,వైద్యం, తదితర సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు.సమాజంలో కొంతమంది ప్రజలు, అధికారులు తమను వేధిస్తున్నారని వీరి నుండి రక్షణ కల్పించాల్సిందిగా తమ దృష్టికి తీసుకువచ్చారని,మీకు అండగా ఉంటామని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు బరోసానిచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అదనపు డైరెక్టరు బి.రామ్ కుమార్,చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.యన్.వి.మునీశ్వర రావు,మాస్టర్ ట్రైనరు పి.రత్నరాజు, ఎక్కువ సంఖ్యలో ట్రాన్స్ జెండర్స్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మదన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి కళ్యాణ మహోత్సవం



**కాకినాడ,మేజర్‌న్యూస్:** కాకినాడ రామారావుపేటలో ఉన్న శ్రీ మదన్న పూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామివారి కళ్యాణ మహోత్సవ వేడుకల ను గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. లోక కళ్యాణం కోసం నిర్వహించిన ఈ కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగిందని కార్యక్రమ ప్రోత్సాహకులు టీవీ రమణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ (రాజ్యసభ సభ్యుడు) సానా సతీష్ బాబు దంపతులు హాజరయ్యారు. ముందుగా ఎంపీ సానాను ఆయన అభిమానులు మేళ తాళాలతో భారీ ఎత్తున స్వాగతంతో బాణాసంచ కాల్చి తీసుకొచ్చారు. ఆయనకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వెంకటేశ్వర రావు (కొండబాబు) ఘన స్వాగతం పలికారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు పురోహితులు స్వాగతం పలికారు. లోక కళ్యాణ నిమిత్తం నిర్వహించే ఈ మహోన్నత కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ కార్పొరేటర్ మల్లిపూడి దీపిక, నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, నురుకుర్తి వెంకటేశ్వరరావు,గింజాల శ్రీనివాస్, పసుపులేటి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, ఆళ్ళ బాలకృష్ణ, చిందాన సూరిబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి బాదం శ్రీనివాస రామచంద్రరావు, దేవాదాయ శాఖకు చెందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ‘అన్నా క్యాంటీన్’ ఏర్పాటుకు పనులు ప్రారంభం

**మొదటిపేజి తరువాయి**

రెండు పూటలా అన్నం తినే విధంగా మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రెండు రూపాయలకే కిలో బియ్యం గతంలో ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలో ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుండి వివిధ రకాలైన పనులు మీద వచ్చే ప్రజలకు కడుపునిండా అన్నం తినే విధంగా ఐదు రూపాయలతో అన్న క్యాంటీన్ ద్వారా భోజనం ప్రతిరోజు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. 11మండలాలలో రెండు మండలాలు లేక మూడు మండలాలకు ఒక అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలియజేయడం జరిగిందని, అదేవిధంగా ముందుగా నియోజకవర్గంలోని రంపచోడవరం గ్రామంలో అన్నా క్యాంటీన్ రాష్ట్ర ముఖ్యమంత్రి అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో పేద బడుగు వర్గాల వారికి మంచి పాలన అందించే విధంగా తన వంతు కృషి చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రజలకు నియోజకవర్గం కేంద్రంలో ఈ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన అన్న క్యాంటీన్ సుమారు 50 రోజులలో భవన పనులు పూర్తి చేసే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు.

ఈ అన్న క్యాంటీన్ ప్రారంభమైన తరువాత ఏజెన్సీ లోని మారుమూల గ్రామాల నుండి వచ్చే ప్రజలకు ఐదు రూపాయలకే కడుపునిండా అన్నం తినవచ్చని ఆయన అన్నారు. జిసిసి డైరెక్టర్ జి.డి. సునీత మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి పేదవారు అన్నా క్యాంటీన్లో ఐదు రూపాయలకే భోజనం పెట్టే విధంగా ఈరోజు శంకుస్థాపన చేయడం చాలా సంతోషకరమైన విషయమని ఆమె అన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంత అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా అభివృద్ధి చేసుకొనే బాధ్యత మనందరిపై ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పి.రామకృష్ణ, రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీడీవో సుందం శ్రీనివాసరావు దొర, డిప్యూటీ తాసిల్దార్ జిలానీ, సిఐ రవికుమార్, సబ్ ఇన్స్పెక్టర్ వెంకటరావు, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, కారం సురేష్, వై.నిరంజని దేవి, సలాది బాపిరాజు, పెంటపాటి అనంత మోహన్, సిద్ధ వెంకన్న బాబు, షేక్ సుభాని, పోలోజు సురేష్, పండా చెల్లన దొర, పి.శ్రీనివాస్, బంగారు వీరబాబు, ఏపిఎం రామ కామేశ్వర స్వామి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# 'మావోయిస్టుల'తో గిరిజనాభివృద్ధి సాధ్యం కాదు






**– పోలీసులు ఎదుట లొంగిపోవాలని ఎస్పీ పిలుపు**

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** మావోయిస్టులతో గిరిజనాభివృద్ధి సాధ్యం కాదని, గిరిజన యువత పోలీసులు ఎదుట లొంగిపోవాలని అల్లూరి సీతారామరాజుజిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పిలుపునిచ్చారు. అల్లూరి సీతా రామరాజు జిల్లా వై.రామవరం మండలంలో బుధవారం పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇరువురు మావో యిస్టు నేతలు మృతి చెందిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ గురు వారం రంపచోడవరం రంపచోడవరం వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లా డుతూ ఎన్‌కౌంటర్ జరిగిన నేపథ్యం వివరించారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఆస్పత్రి వద్ద ఎస్పీ పరిశీలించారు. కాల్పులు సంఘటన జరిగిన తర్వాత ఆ ప్రదేశంలో రెండు ఎకె 47 తుపాకులతో పాటు రౌండ్స్, విప్ల వ సాహిత్యం, మెడికల్ కిట్లు, ఇతర సామాగ్రి, రూ.98 వేలు నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ కీలక నేతలు సరిహద్దు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నారని సమాచారం మేరకు పోలీస్ పార్టీలు గాలింపు చర్యలు చేపట్టారని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రంపచోడవరం డిఎస్పీ జి.సాయి ప్రసాద్,చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, రంపచోడవరం సిఐ రవికుమార్ పాల్గొన్నారు.

# యుద్ధ సన్నద్ధతపై పెరవలి సెంటర్లో మానవహారం



**పెరవలి, మేజర్ న్యూస్ :**మండల కేంద్రంలో మే 8వ తేదీ గురువారం యుద్ధ సన్నద్ధతపై మానవహారంతో ప్రజలకు అవగాహన కల్పిం చారు.జమ్మూకాశ్మీర్‌లో జరిగిన మరణాల వలన యుద్ధం సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు పెరవలి సెంటర్ వద్ద మానవహారంతో అవగాహన కల్పించడమైనది. ప్రజలు అందరు ఎటువంటి టూర్‌లకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండవలెను అని, మంచి నీళ్ళ అందుబాటులో పెట్టుకోవలెను అని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే పెరవలి తాసిల్దార్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎంపీడీవో లకు తెలియజేయవలెనని ప్రజలు అందరూ ఇళ్ల వద్దనే సురక్షితముగా ఉండవలెను అని తహసిల్దార్ డి అచ్చుతకుమారి, ఎంపీడీవో సిహెచ్ వెంకటరమణ, ఏఎస్ఐ సూచంద్రావు లు మానవ హారంను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ పంచాయితీ కార్యాదర్శులు పాల్గొన్నారు.

# ఐదు నెలల చిన్నారి హత్యా ఘటనపై దర్యాప్తు కొనసాగుతుంది..

**– సంఘటనా స్థలంలో క్షుద్ర పూజలు ఉద్దేశపూర్వకంగా సృష్టించినవే**

**– పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్**




**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** పిఠాపురం స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో సంచలనం కలిగించిన ఐదు నెలల పసికందు హత్యా ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఐదు నెలల పసికందు అయిన తన మనవరాలిని ఎవరో ఎత్తుకు వెళ్ళిపోయారని పాప తాత దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదుపై... సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో ఏఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారని అన్నారు. క్షుద్ర పూజలు అనే సీన్ ను క్రియేట్ చేసి పాపను అపహరించినట్టుగా ప్రాథమికంగా గుర్తించామని, ఈ ఘటనపై నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు.

పసికందు హత్య కేసు తీవ్రత దృష్ట్యా... టెక్నాలజీని ఉపయోగించి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ని రంగంలోకి దించి పలు ఆధారాలు సేకరించడం జరిగిందన్నారు. అక్కడ క్షుద్ర పూజలు జరిగినట్టుగా చెప్పబడుతున్న దానిలో వాస్తవం లేదని, నిద్ర పూజలు అనేవి కేవలం ఉద్దేశపూర్వకంగా సృష్టించబడిన దేనిని ప్రాథమికంగా నిర్ధారించామని, జరిగినటువంటి హత్యా సంఘటనను కప్పిపుచ్చేందుకు క్షుద్ర పూజలు నాటకం ఆడినట్టు తెలుస్తుందన్నారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్ రిపోర్టు ప్రకారం కోర్టులో హాజరు పరుస్తామని, ఎవరు చేశారు...? ఎందుకు చేశారు...? అనేటటువంటి విషయాలను వెల్లడిస్తామని తెలిపారు. క్షుద్ర పూజలు చేతబడులు అనేటటువంటివి ఎక్కడ లేవని ప్రజలు అటువంటి వాటిని నమ్మవద్దని కోరారు.

# పిఠాపుర కళావేదికపై పుస్తకావిష్కరణ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, పురుహూతికా కల్చరల్ అసోసియేషన్, మన ఊరు మన బాధ్యత సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సూర్యారాయ విద్యానంద గ్రంథాలయం పిఠాపుర కళావేదిక నందు ఆకొండి (ముద్దు)వెంకటలక్ష్మి రచించిన మూడు కవితా సంపుటాలు, వారి తల్లికి అంకితమిచ్చి ఆవిష్కరణ చేశారు. కవన సవ్వడులు, వ్యాసమంజరి, భావనా కుసుమాలు అనే పుస్తకాలు ఆవిష్కరణ సందర్భంగా అనేకమంది కవులు పాల్గొని సమీక్ష చేశారు.ఈ కార్యక్రమం నందు కేవీఎస్ఎస్ ప్రసాద్, వెన్నపు చక్రధరరావు, కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, తటవర్తి సుబ్బారావు, రేగళ్ల నీలకంఠ శర్మ, అకొండి శివరామకృష్ణ, మరియు ఆకొండి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలలో 7, 9 తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రాజవమ్మంగి ఏకలవ్య మోడల్ పాఠశాలలో 7 9 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కొరకు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పి ఓ కట్ట సింహాచలం తెలిపారు. ఏడవ తరగతిలో బాలురు 5, బాలికలకు ఒకటి, తొమ్మిదో తరగతిలో ఒక సీటు బాలురకు ఖాళీగా ఉన్నాయని ఈనెల 10లోగా దరఖాస్తులు పాఠశాలలో అందచేయాలన్నారు. ఈ మేరకు రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని మరిన్ని వివరాలకు ఈఎంఆర్ఐ పాఠశాలకు వెళ్లి తెలుసుకోవాలన్నారు.


## తుని పురపాలక సంఘం

ఆర్.ఒ.సి. నెం: 388/2017/ఇ1 తేది. 08.05.2025

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

తుని పురపాలక సంఘము నందు సాధారణ నిధుల నుండి 5 పనులు మరియు కావుడ నిధులతో 1 పని (రీటెండరు) చేపట్టి పూర్తి చేయుటకు 'ఇ' ప్రొక్యూర్‌మెంటు ప్లాట్‌ఫారంపై టెండరు ఆహ్వానించడమైనది. సదరు టెండరుకు సంబంధించిన ఇతర వివరములు ది.12-05-2025 ఉదయం గం.11.00 నుండి www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సంప్రదించవలసిన చిరునామా : కమిషనరు, తుని మున్సిపాలిటీ.

ఫోన్ నెం : 9849905806, 9849919375, 08854-253506

e-mail : tunimunicipality@gmail.com

సం// ఎ.వెంకటరావు,
కమిషనరు,
తుని పురపాలక సంఘం

# నాణ్యతకు పెద్దపీట వేస్తూ మెరుగైన సేవలు అందించాలి



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగులు నాణ్యతకు పెద్దపీట వేస్తూ నైపుణ్యతతో మెరుగైన సేవలు అందిస్తూ ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని ప్రజలలో పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఉద్యోగు లకు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు గత రెండు నెలలుగా రెవెన్యూ సర్వే ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు సామర్థ్యాలను పెంపొందించే దిశగా నిర్వహిస్తున్న పరీక్షలు, క్విజ్‌లలో గెలుపొందిన ఉద్యోగులకు లాప్టాప్‌లు, ప్రింటర్లు బహుమతులను ప్రధానం చేశారు. ఈ క్విజ్జులలో ప్రథమ స్థానంలో మండపేట, ద్వితీయ స్థానంలో రావులపాలెం, తృతీయ స్థానంలో రాజోలు, నాలుగో స్థానంలో ఆత్రేయపురం, ఐదో స్థానంలో అమలాపురం తాసిల్దార్ బృందాలు ఎంపిక కాబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని ఆఫ్లైన్, ఆన్లైన్ వాట్సాప్ సేవలను విస్తృతంగా చేపట్టి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళనవసరం లేకుండా సుపరిపాలన అందించాలన్నారు. ప్రభుత్వ సేవలలో ఉత్తమ ఫలితాల సాధనకు నైపుణ్యాలను మరింత తగా మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రభుత్వ ఉన్నతాధికారుల నుండి వస్తున్న ఉత్త ర్వులు చట్టాలు వెనువెంటనే అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు సీసీఏ రూల్స్ మెజిస్టీ రియల్ సెక్షన్స్, పౌరసరఫరాల చట్టాలు భూ పరిపాలన సంబంధిత మరియు రీసర్వే చట్టాలపై మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. 22మండలాల పరిధిలో రెవెన్యూ సర్వే ఉద్యోగులు వెయ్యి మందితో విధుల పట్ల నైపుణ్యత సామర్థ్యాలను నాణ్యతాపరమైన సేవలను అందించేదిశగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి నేతృత్వంలోని బృందం చేస్తున్న కృషిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.ప్రభుత్వ యంత్రాంగంలో తలమానికమైన రెవెన్యూ శాఖలో ఆధునిక సాంకేతికతను జోడిస్తూ ప్రజలకు ఆఫ్లైన్, ఆన్లైన్ వాట్సాప్ సేవలు,కార్యాలయాల చుట్టూ తిరగకుండా అందిస్తూ సుపరిపాలన వైపు ప్రభుత్వం దృష్టి సారించిందని,ఆదిశగా యంత్రాంగం సర్వసన్నద్ధంగా పనిచేయాలన్నారు.ఈ ప్రక్రియను డాక్యుమెంటేషన్ చేసి భూపరిపాలన కమిషనర్‌కి సమర్పించాలని డిఆర్ఓ రాజకుమారివారిని ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ పౌరసరఫరాలు సర్వే విభాగాలలో ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఓపెన్ హౌస్, రెవెన్యూ కేర్ పేరిట ప్రతి నెల మొదటి శనివారం ఉద్యోగుల ఫిర్యాదులను స్వీకరిస్తూ పరిష్కారానికి వెంటనే చర్యలు గైకొంటున్నామని తెలిపారు. విధి నిర్వహణలోతప్పులు జరిగినప్పుడు వాటిని అంగీకరించి సరిదిద్దుకోవాలన్నారు. వృత్తి నైపుణ్య సంబంధిత పూర్తి జ్ఞానం కలిగి ఉండాలన్నారు. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను ఎప్పటిక ప్పుడు మెరుగు పరుచుకోవాలన్నారు. సమయపాలన పాటిస్తూ కార్యాలయానికి సకాలంలో హాజరై కేటాయించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో రాజకుమారి ఆర్డీవో కే.మాధవి, ఏవో కాశీ విశ్వేశ్వర రావు, తహసిల్దారులు తేజేశ్వరరావు, ముక్తేశ్వరరావు, ప్రసాద్, రాజేశ్వరరావు, అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## కథలు చెప్పడం, డిబేటింగ్‌పై విద్యార్థులకు అవగాహన



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం శాఖా గ్రంధా యంలో వేసవి శిక్షణా తరగతులలో భాగంగా గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం విద్యార్థులకు కథలు చెప్పడం జరిగింది. అనంతరం డిబేటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు రాళ్ళపల్లి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి జేకేసిటి ఆధ్వర్యంలో సిమెంటు రేకులు ఇనుప పైపులు వితరణ




**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండలంలోని ఏజి కోడేరు పంచాయతీ ఉలుమూరు గ్రామానికి చెందిన పులి భద్రమ్మ అనే గిరిజన మహిళ ఇల్లు గత వరదల ధాటికి కొట్టుకుపోవడంతో నిరాశ్రయురాలైనది. ఈ క్రమంలో బాధిత మహిళ ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ ఎండి జమాల్ ఖాన్‌ను సంప్రదించి ఇంటి నిర్మాణానికి సహాయం అర్థించినది. మహిళ పరిస్థితిని గుర్తించి గురువారం భద్రమ్మ ఇంటి నిర్మాణానికి కావలసిన ఇనుప పైపులు సిమెంటు రేకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెకెసిటి ట్రస్ట్ సభ్యులు రసూల్, రమణయ్య, జాన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా వ్యాధి పట్ల ప్రజల ప్రభుత్వం ఉండాలి

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాల పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు వహించాలని డి.ఎం.ఓ. కె.నారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఓబలంక గ్రామంలోఒక వ్యక్తి తరచు జార్ఖండ్ రాష్ట్రం వెళ్లి వస్తుంటాడని, అలా వెళ్లి రావడం పట్ల అతడికి తరచు తీవ్ర అనారోగ్యం పాలు అవ్వడంతో అతనికి వైద్య పరీక్షల నిమిత్తం ఊబలంక పిహెచ్సి ల్యాబ్ తీసుకురాగా రక్త పరీక్షలు నిర్వహించి అతడకి మలేరియా సోకినట్లుగా నిర్ధారించారు. దీంతో వైద్యాధికారుల అప్రమత్తమై, వారి పర్యవేక్షణలో మూడు వైద్య బృందాలు ఏర్పాటు చేసి గ్రామంలోని మలేరియా పట్ల జాగ్రత్తలు ఎలా వహించాలనే దానిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చారు. డాక్టర్ హసీనా, ఎంపిహెచ్ వెంకటేశ్వరరావు, కే.సభ్యుల రాజ్, జి.వి.వి.నారాయణ, లక్ష్మణ్, ఇర్ఫాన్, ఏఎన్ఎమ్ లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## దేశం మేలు కోసం నరసింహ జపం



**రాజమండ్రి, మేజర్ న్యూస్ :** రాజమండ్రి ఉత్తరాది మఠం మరియు ఆంధ్ర మధ్వ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో మనదే శంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా అంతా మంచే జరగాలన్న భావనతో ఉత్తరాది మఠాధిపతులు శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ ఆదేశానుసారం శ్రీ లక్ష్మీ నరసింహ మంత్రాన్ని అఖండ జప కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని అందులో భాగంగా రాజమండ్రిలో కూడా నిర్వహిస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శి కందాలం నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమాలు రాజమండ్రి ఉత్తరాది మఠాధికారి సుధా పండితులు విజయ సింహాఆచార్ ఆధ్వర్యంలో "ఓం లక్ష్మీ నరసింహాయ నమః" అనే మంత్రాన్ని నిత్యము జపించడం ద్వారా దేశానికి దేశం తరపున పోరాడుతున్న సైనికులకు భగవంతుడు పరిపూర్ణమైన శక్తినిచ్చి నూతన శుభాన్ని చేకూరుస్తారని స్వామీజీ ఉపదేశించారని నరసింహారావు వివరించారు.

తెలుగు రాష్ట్రాలలోనే శతాబ్దాల చరిత్ర కలిగి రాజమండ్రి మఠ ప్రాంగణంలో వున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి ఈ నెల 10వ తేదీన నరసింహ జయంతి సందర్భంగా రాజమండ్రి ఉత్తరాది మఠం సుధా పండితులు విజయ సింహాఆచార్ స్వీయ పర్యవేక్షణలో రాజమండ్రి గోదావరి తీరంలో ఉన్న ఉత్తరాది మఠ ప్రాంగణంలోని స్వామివారికి కల్యాణోత్సవాన్ని పదో తారీకు సాయంత్రం 6 గంటల నుండి ప్రారంభమవుతుందని అందరూ పాల్గొనవలసిందిగా నరసింహారావు కోరారు. కాకినాడలో జర్నలిస్ట్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో మధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ ఆధ్వర్యంలో నరసింహనామ జప కార్యక్రమాన్ని బుధవారం నుండి ప్రారంభిం చారని నరసింహారావు తెలిపారు.

# ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి



**- ఆదివాసి సంక్షేమ పరిషత్**

**ఎటపాక,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గొమ్ము కొత్తగూడెం, గొమ్ము కోయగూడం గ్రామాలలో ఆదివాసి చట్టాలపై అవగాహన అవగాహన కల్పిస్తూ, ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చింతూరులో నిర్వహించే 'ఆదివాసి హక్కుల గర్జన బహిరంగ సభ' ను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల నాయకులు ఊకె రాంబాబు మాట్లాడుతూ ఆదివాసులకు ఉద్యోగ భద్రత కోసం 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియమకాల కోసం లోకల్ క్యాడర్ పోస్టులను స్థానిక ఆదివాసి నిరుద్యోగ అభ్యర్థులతోనే భర్తీ చేసే విధంగా 'ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం' చేసిన తర్వాతనే మెగా డీఎస్సీ 2025 నియమకాలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

లేని పక్షంలో మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులను మినహాయించి ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించి ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంతో త్యాగం చేసి భూములు ఇచ్చిన ఆదివాసి నిర్వాసితులకు భూమికి భూమి, 2013 భూ సేకరణ చట్టం ప్రకారంగా నష్టపరిహారం చెల్లించా లని, ఆర్ & ఆర్ ప్యాకేజీ పూర్తిగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సున్నం శివాజీ, సున్నం కుమారి, అప్క రామదాస్, ఊకే రాము, ఖాసిం, సున్నం లక్ష్మీదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఇంటర్మీడియేట్ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను సమన్వయంతో చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు వివిధ శాఖల అధికారులను కోరారు. గురువారం మధ్యాహ్నం ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 12 నుండి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని, ఈ పరీక్షలకు మొత్తం 21,541 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో 15,933 మంది మొదటి సంవత్సర పరీక్షలకు, 5,608 మంది రెండవ సంవత్సర పరీక్షలకు హాజరౌతారన్నారు. వీరి కోసం జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మొదటి సంవత్సర పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ, రెండవ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2-30 గంటల నుండి 5-30 గంటల వరకూ సిసి కెమేరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. వరీక్షలు సజావుగా నిర్వహించేలా పర్యవేక్షించేచందుకు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన హైపవర్ కమిటీ మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తుందని ఆయన తెలిపారు. సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా పత్రాలు, సామాగ్రి ఉంచిన స్ట్రాంగ్ రూమ్, మెటీరియల్ పంపిణీ, తిరిగి సేకరణ చేసే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను డిఆర్ఓ కోరారు. పరీక్షల తేదీలలో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయాలని, వాటి సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను పరిక్షల సమయంలో మూసివేయించాలని తహశిల్దారును ఆదేశించారు. జంబ్లింగ్ విధానంలో జరుగుతున్న ఈ పరీక్షల కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు తగిన బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. వేసవి అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యార్థులెవరికైనా అస్వస్థత కలిగితే తక్షణ వైద్య సహాయం అందించేందుకు ఎఎన్ఎం ఆధ్వర్యంలో అన్ని పరీక్షా కేంద్రాలలో మెడికల్ పోస్టులు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖను కోరారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద పరిశుభ్రత, త్రాగునీరు ఏర్పాట్లు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్లు, డిపిఓకు సూచించారు. పరీక్షల సమయంలో అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అన్ని పరీక్షా కేంద్రాలలకు కల్పించాలని విద్యుత్ అధికారులను కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలను సజాపుగా నిర్వహించాలని డిఆర్ఓ వెంకట్రావు కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఐ.శారద, జిల్లా పంచాయితీ అధికారి వి.రవికుమార్, జిల్లా పరీక్షా కమిటీ సభ్యులు, వివిధ సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# 120 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావం




**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** పాకిస్తాన్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో నిర్వహించిన మెరుపు దాడులకు హర్షం వ్యక్తం చేస్తూ అందుకు మద్దతుగా కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో ఎన్నారై కల్లేపల్లి రాజేష్ ఆధ్వర్యంలో 120 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ గురువారం సాయంత్రం సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, జెన్నెల శంకర్‌లు హాజరయ్యారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి పురవీధులకుండా 120 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ భారత్ మాతాకీ జై... భారత్ జిందాబాద్, నరేంద్ర మోడీ జిందాబాద్ ఇండియన్ ఆర్మీకి జై అంటూ ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాద శిబిరాలపై సాహసోపేత దాడులు చేసిన భారత సైన్యం పాకిస్థాన్‌కు గట్టిగా సమాధానమిచ్చిందన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు అమాయక భారతీయ పౌరుల్ని చంపడం దారుణమన్నారు. దేశ భద్రతకు భంగం కలిగించే చర్యలను సహించమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ మార్గం గుండా వెళ్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ హాజరై సంఘీభావం తెలిపారు.

# హెన్రీ డునాంట్ సేవలు మరువలేనివి

**- జాయింట్ కలెక్టర్ చిన్న రాయుడు**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఈస్ట్ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో వరల్డ్ రెడ్ క్రాస్ డే మరియు ఇంటర్నేషనల్ తలసేమియా డే సందర్భంగా స్థానిక కోటిపల్లి బస్ స్టాప్ వద్దగల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆఫీస్ నందు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు రక్తదాన అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. తొలుత జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి ఆధ్వర్యంలో, హెన్రీ డునాంట్ జన్మదినం సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొని తరువాత రక్త దానం చేశారు. తొలుత జాయింట్ కమిషనర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా అనేకచోట్ల రెడ్ క్రాస్ డే వేడుకలు నిర్వహించారు. సీతానగరం మండలం రఘుదేవపురంలో చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు, బొమ్మూరులోని జిపిఆర్ జెడ్ పి హెచ్ స్కూల్ నందు హెచ్ఐవి పాజిటివ్ చిన్నారులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు, ఎస్ కే వి టి ప్రభుత్వ కళాశాల వై ఆర్ సి వాలంటీర్లు జీవ కారుణ్య సంఘం వద్ద పళ్ళు, రొట్టెలు పంచిపెట్టారు మరియు ఎస్ కే వి టి స్కూల్ జే ఆర్ సి విద్యార్థులు స్కూల్ పరిసర ప్రాంతాలలో ఆహార పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ టి సీతారామమూర్తి , డి ఆర్ డి ఏ పిడి ఎన్ వి ఎస్ ఎస్ మూర్తి, ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, రాజమండ్రి అర్బన్ ఎమ్మార్వో పాపారావు , రెడ్ క్రాస్ సభ్యులు డాక్టర్ మహాలక్ష్మి, కె.వి రమణ, బండి వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పాగోటి రాంబాబు, డాక్టర్ జివిఎస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు రైస్ కార్డ్ వచ్చేలా చూడాలి - ఎంపిడిఓ



**అల్లవరం,మేజర్‌న్యూస్ :** మండలంలోని బెండమూర్లంక, తుమ్మల పల్లి, గోడిలంక సచివాలయంలను ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ గురు వారం సందర్శించారు. ఈ సందర్భంగా రైస్ కార్డ్ కోసం ఆన్లైన్‌లో నమోదు ప్రక్రియ, ఆధార్ స్పెషల్ క్యాంపులు, సర్వేల పురోగతి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్లు, లోన్లు వంటి వాటికి తప్పనిసరిగా కావలసిన రైస్ కార్డ్ కోసం దరఖాస్తు, ఎడిషన్, స్ప్లిట్ ఆప్షన్ ఇపుడు ఇచ్చినందున అర్హులకు అవగాహన కల్పించి వారికి రైస్ కార్డులు అందేలా చూడాలని విఆర్ఓలు, సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ కుమార్, విఆర్ఓ లు నారాయణమూర్తి,చంద్రరావు, సచివాలయం సిబ్బంది ప్రవల్లిక, స్పందన, కృష్ణకుమారి,లలిత,కరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న తహశీల్దార్ వెంకటలక్ష్మీ



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం పట్టణంలో వేంచేసి యున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని బుధవారం పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ పర్యవేక్షణలో వేదపండితులు అమ్మ వారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనాలు అందజేసి, అనంతరం ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్ర సాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్ర ప్రసాద్ (నాని), రాయ విజయ్‌కు మార్, సిబ్బంది వెంకటరమణ, వరహాలు, లోవ, శివ తదితరులు ఉన్నారు.

## రెండవ రోజుకు చేరిన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు చేపట్టిన ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె గురువారానికి రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ నాయకులు మాట్లాడుతూ పెద్దాపురం పురపాలక సంఘం ఇంజనీరింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరూ సమ్మెకు వెళ్లుచున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర నాగేశ్వరరావు, సుంకర సత్తిరాజు, నామ సూర్యప్రకాశరావు, పూల ప్రశాంత్, మహపాతిన పాపారావు, వాకాడ భాస్కరరావు, కోనాల వెంకటరమణ, ఒంటిమి సోనియా, అయ్యప్ప స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి





**– ఇంచార్జ్ యం.పి.పి గొల్లపల్లి శ్రీనివాస రావు**

**యలమంచిలి,మేజర్ న్యూస్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశమునకు ఇన్చార్జ్ ఎంపిపి గొల్లపల్లి శ్రీనివాస రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి వెళ్ళినప్పుడు, ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులైన ఎంపీటీసీలకు సర్పంచులకు సమాచారం ఇవ్వాలని ఆయా సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు కనీసం ఇటువంటి సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలను నిర్వహించడం సబబు కాదన్నారు ప్రోటోకాల్ పాటించని వారిపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు అలాగే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కొరకు వేస్తున్న సిసి రోడ్లు నిర్మాణంలో ఏవైనా కరెంటు స్తంభాలు గాని పోల్స్ గాని అడ్డు వస్తే వాటిని తొలగించాలని సంబంధిత ఎలక్ట్రికల్ అధికారులకు సూచించారు కరెంట్ స్తంభాలు, పోల్స్‌ని తొలగించే సమయంలో ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు ఏవో సిహెచ్ దేవి, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు మాట్లాడారు. అనంతరం వివిధ శాఖల అభివృద్ధి పనులు పై అధికారులు ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్, ఎంపీడీవో ప్రేమాన్విత ఎంపీటీసీలు ఇ నుకొండ ధనలక్ష్మి,జిల్లెల్ల రత్నం రాజు,సర్పంచులు తాళ్ళ నిమ్మకాయల రామకృష్ణ, వినుకొండ రవి నాగరాజు, ,కొండేటి జీవరత్నం, పాలంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతంలోని పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

**– గోరుముచ్చు నాంచారయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అరుణ్**



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** గిరిజన ప్రాంతంలోని పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందని అల్లూరి గోరుముచ్చు నాంచారయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జి అరుణ్ అన్నారు. మండలంలోని రెడ్డి గణపవరం గ్రామంలో విజయవాడ హెల్ప్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి, గోరుముచ్చు నాంచారయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. ట్రస్ట్ సభ్యురాలు జి నీలిమ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రవి శిబిరాన్ని ప్రారంభించారు. గోరుముచ్చు నాంచారయ్య ట్రస్ట్ చైర్మన్ జి అరుణ్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలో వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాటు వైద్యానికి స్వస్తి పలికి అత్యదునిక వైద్య సదుపాయాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని హెల్ప్ హాస్పటల్ యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్థానిక పెద్దలు గద్దె లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పి మంగరాజు,జి పవన్ కళ్యాణ్ ,బొమరాజు సత్యనారాయణ రాజు, సర్పంచి తెల్లం జయమ్మ,ఎల్లం ప్రసాదు,పర్సా జలపాలు,పూనెం దుర్గారావు, ముళ్ళపూడి హర్ష, గురజాల వెంకటేశ్వర రావు తదితరులు ఉన్నారు.

# ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న ప్రభుత్వం





**– ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేస్తూ వస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఇదేసమయంలో ప్రజాహితమే కూటమి ప్రభుత్వ అభిమతమనే విషయాన్ని ఉద్యోగులు కూడా గ్రహించాలని సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గురువారం ప్రజావినతులందించేందుకు వచ్చిన వారితో కిక్కిరిసింది. తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే బడేటి చంటి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఇదేక్రమంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వార్డు సచివాలయాల్లో పనిచేస్తోన్న అడ్మిన్‌లు తమ సమస్యలను ఎమ్మెల్యే బడేటి చంటి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలను సావధానంగా తెలుసుకున్న ఆయన వాటి పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తానంటూ భరోసా కల్పించారు. అలాగే స్థానిక 2వ డివిజన్ టిడిపి నూతన కమిటి ఎమ్మెల్యే చంటిని మర్యాదపూర్వకంగా కలుసుకుంది.

ఈ సదర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసమస్యలతో పాటూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ఈ విషయంలో ఎవరై అధైర్యపడాల్సిన అవసరం లేదని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలకు నూతన ట్రస్ట్ బోర్డులు : కమిషనర్ రామచంద్ర మోహన్

**నరసాపురం, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలోనిపలు దేవాలయాలకు నూతన ట్రస్ట్ బోర్డులు ఏర్పాటు కు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ కే రామచంద్ర మోహన్ తెలిపారు. నరసాపురంలో గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్మణే శ్వరంలోని శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి, పట్టణంలోని అమరేశ్వర స్వామి, ఆది కేశవ యంబర్నన్నారు స్వామి, రాజగోపాల స్వామి, కపిల మల్లేశ్వర స్వామి, జగన్నాథ స్వామి దేవాలయాలకు నూతన ట్రస్ట్ బోర్డులు నియమిస్తామన్నారు. మండలంలోని కొప్పర్రు గ్రామం శ్రీ సీతారామ స్వామి, మొగల్తూరు మండలం కేపీ పాలెం లోని రాజగోపాల స్వామి దేవాలయాలకు కొత్త నియామకాల చేపడతామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల్లోపు దరఖాస్తులు అందజేయాలని కమిషనర్ కోరారు.

# నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1లక్ష విరాళం



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** శ్రీ ఒకుళ మాతా నిత్యాన్నదాన ట్రస్టుకు గురువారం ఉదయం భీమవరం పట్టణానికి చెందిన పోలిశెట్టి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ 1,00,116/- లు విరాళాన్ని ఆలయ ఆఫీసు వద్ద సిబ్బందికి విరాళాన్ని అందజేశారు.దాతకు ఆలయ సూపరింటెండెంట్ హైగ్రీవాచార్యులు స్వామి వారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి బాండు పత్రాలను ప్రసాదాలను అందజేసి అభినందనలు తెలిపారు.

# ఆపరేషన్ సింధూర్ అభినందనీయం

**: బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి**



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** ఉగ్రవాదులను పెంచిపోషిస్తూ భారతదేశంలో అమాయకుల ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రదేశం పాకిస్తాన్ లోని ఉగ్రశిబిరాలను ధ్వంసం చేసి100 మంది ఉగ్రవాదులను ఆపరేషన్ సింధూర్‌తో మట్టుబెట్టి గట్టి హెచ్చరిక చేసిన నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రపంచదేశాలు మద్దతు తెలిపాయని బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి పేర్కొన్నన్నారు. తాడేపల్లిగూడెం బిజెపి కార్యాలయం లో గురువారం నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో శ్రీదేవి మాట్లాడారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం దేశ సైనిక శక్తి సామర్ధ్యలను ప్రపంచానికి చాటి చెప్పిందని కొనియాడారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ పాకిస్తాన్‌కు తగిన బుద్ధిచెప్పేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వంనికి, చేపట్టిన ఆపరేషన్ సింధూర కు ప్రతి భారతీయుడు మద్దతునిచ్చారని పేర్కొన్నారు. బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు కర్రి ప్రభాకర బాలాజీ మాట్లాడుతూ భార్యల ఎదుటే భర్తలను ఉగ్రవాదులు కాల్చి చంపి ఆ మహిళల పసుపు, కుంకాలు తుడిచివేసిన ఉగ్రవాదముష్కరులకు పాకిస్తాన్ కు తగిన బుద్ధి చెప్పేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ సింధూర పేరిట సైనిక చర్యలు చేపట్టిందని తెలిపారు.బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదపోలు వీర రాఘవులు,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొండపల్లి నగేష్,బిజెపి జిల్లా సీనియర్ నాయకులు కంచిమర్తి నాగేశ్వరరావు, గూడెం పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్,పెంట పాడు మండల అధ్యక్షులు దత్తు ప్రసాద్, నియోజవర్గ కో కన్వీనర్ రామగాని సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ముత్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి

**– జె సి రాహుల్ కుమార్ రెడ్డి**



**ఉండి,మేజర్‌న్యూస్ :** ఆక్వా రైతుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికితీసుకువెళ్లడం జరుగుతుంది అని జిల్లాజాయింట్‌కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డిఅన్నారు. గురువారం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉండి మత్స్య పరిశోధన కేంద్రంలో ఆక్వా సాగులో సాంకేతిక అనుకరణలు, యాజమాన్యం పద్ధతులు అంశంపై రైతులకు జరుగుచున్న మూడు రోజులు శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్‌టి.రాహుల్ కుమార్‌రెడ్డిముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతో అధిక ఉత్పత్తులు సాధించవచ్చునని అన్నారు. ఆక్వా సాగులో మంచి క్వాలిటీతో ఉత్పత్తిని పెంపొందించడానికి, రైతులు కొత్త టెక్నాలజీ పద్ధతులను తెలుసుకోవడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మూడు రోజులు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆక్వా అంటేనే ముందుగా గుర్తుకు వచ్చేది పశ్చిమ గోదావరి జిల్లా అన్నారు. ఇక్కడ జరిగే సాగు విధానాలను తెలుసుకోవటానికి అనేక ప్రాంతాల నుండి రైతులు రావడం జరుగుతుందని అన్నారు. ఆక్వా రైతులు నూతన సాంకేతిక యంత్రాలను ఉపయోగించి ఉత్పత్తులను పెంచుకోవాలని సూచించారు. జిల్లాలో 1.33 లక్షల ఎకరాలకు గాను రిజిస్ట్రేషన్ చేసుకున్నవి 49 వేల ఎకరాలు మాత్రమే అని తెలిపారు. ఆక్వా సాగులో టెక్నాలజీ పెంపొందించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. అనంతరం ఆక్వా రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలోజిల్లామత్స్యశాఖ అధికారి నాగ లింగాచారి, డైరెక్టర్ ఫిషరీస్ అభిషేక్ (బీహార్) ఫిషరీస్ యూనివర్సిటీ ఓఎస్‌డి డాక్టర్ సుగుణ,ఎం పేడ ఫీల్డ్ ఆఫీసర్ దుర్గారావు, డాక్టర్ చంద్రశేఖర్,చంద్రశేఖర రావు, శ్రీనివాసరావు, పని ప్రకాష్,ఎఫ్‌డివోలు, విలేజి ఫిషరీస్ అసిస్టెంట్లు, ఆక్వా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా ఎబివిపి ర్యాలీ




**భీమవరం,మేజర్‌న్యూస్:** భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి) ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భారత సైన్యానికి మద్దతు ప్రకటించారు.ఎబివిపి నాయకులు మాట్లాడుతూ, దేశ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన నిర్ణయాలకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని, సైనికుల ధైర్యాన్ని యువ తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రజలందరూ ఐక్యంగానిలవాలని పిలుపునిచ్చారు .విద్యార్థులు చేతుల్లో జాతీయ పతాకాలు పట్టుకుని, 'భారత్ మాతాకీ జై', 'పాకిస్తాన్ ముర్దా బాద్' వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ ఎస్ మధ్య మహేష్ ఎబివిపి విభాగ్ కన్వీనర్ కాగిత డిన్నుచందు, పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ రాయి వెంకట్, పట్టణ ఉపాధ్యక్షులు ప్రశాంత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కరానికి కృషి

**– పోలవరం నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండ**
**– వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**



**కుక్కునూర్,మేజర్‌న్యూస్ :** స్థానిక ఎమ్మార్వో కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్ని పంచాయతీల్లో ఉన్న సమస్యలపై ప్రజల నుండి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వినతి పత్రాలను స్వీకరించారు. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను ఆయనే స్వయంగా ప్రతి ఒక్కరిని అడిగి తెలుసు కొన్నారు గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు ఉన్న అధికారులు పని తీరు ఏ విధంగా ఉందో నిర్లక్ష్యం వహిస్తూ విధుల పట్ల అలసత్వం వహిస్తున్న వారి వివరాలు నేరుగా ఎమ్మెల్యేకి తెలియజేయాలని ఆయన ప్రజలను కోరారు. గత ప్రభుత్వం 5ఏళ్ల లో 50లక్షల రూపాయలతో నియోజకవర్గం అభివృద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలం లోనే కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తూ నియోజకవర్గంలో అభివృద్ధిని ఉరకలు పెట్టిస్తోందన్నారు.ఎన్నికల్లో నిర్వాసితులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నూరుశాతంఅమలుచేసిందని నిర్వాసితులు ముఖాల్లో ఆనందాన్ని నింపిందని ఎమ్మెల్యే అన్నారు. రాబోయే రోజుల్లో వరదలు వచ్చే నాటికి మీకు చెందాల్సిన ప్యాకేజీ అందించి తరలించే కార్యక్రమాన్ని చేపడతామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. నిర్వాసితుల కుటుంబాలు సుమారు 2944 మందికిగాను 2785 మందికి నష్ట పరిహారం అందిందని మిగిలిన 158కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని వారికి కూడా త్వరలోనే ఆ నష్టపరిహారాన్ని అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఇటీవలే కాలంలో మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి నిర్వాసిత కాలనీలో పర్యటించగా వారు నివసిస్తున్న గృహాలు కూడా నాణ్యత లేకపోవడం గుర్తించామన్నారు.మరల టెండర్లను పిలిచి నిర్వాసితులను పునర్నిర్మానాలు చేపట్టి వర్షాకాలంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరామన్నారు. పోలవరం నిర్వాసితుల కుటుంబాలను ఎన్డీఏ ప్రభుత్వం ఎప్పుడూ కూడాగుండెల్లో పెట్టుకుని చూసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు.

**– అధికారులు స్థానికంగా నివసించాలి–**కుక్కునూరు మండల కేంద్రంలో జరిగిన ఎన్డీఏ కూటమి నాయకులు సమావేశంలో ఎమ్మెల్యే చిర్రి బాల రాజు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల కేంద్రంలో నివాసం ఉండాలని కోరారు. మండల పరిధిలో నివసించకపోవడం వలన ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని. పరిపాలనా సౌలభ్యానికి ఆటంకం కలుగుతోందని పలువురు ప్రజలు ఆయన వద్దకు వచ్చి మండలలోని అధికారులపై ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నటువంటి అధికారులందరూ ఆయా ప్రాంతాల్లోనే నివాసం ఉండేటట్లు చూసుకోవాలని కోరారు. అధికారులు అందుబాటులో లేరని ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే చర్యలు చేపట్టడానికి ఒక నిమిషం కూడా ఆలోచించనని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, కుక్కునూరు జనసేన మండల పార్టీ ప్రెసిడెంట్ ములిసెట్టి యుగంధర్, వేలేరుపాడు మండల పార్టీ ప్రెసిడెంట్ గణేశుల ఆదినారాయణ. బిజెపి మండల పార్టీ ప్రెసిడెంట్ తూము వెంకన్న, టిడిపి మండల ఉపాధ్యక్షులు మధుర వెంకటరమణ, కూటమి నాయకులు మంత్రి గోపాలకృష్ణ, వెంకన్న బాబు, సాంద్ర రవి ప్రసాద్, చల్లా కోటి,గాడిద వెంకటేశ్వర్లు, మద్దుల రాఘవ, ఆవుల శ్రీనివాస్, అమరవరపు సాయి, పొదిళ్ల ధనస్వామి, పరిటాల గణేష్, కుంజ భద్రం, సత్యనారాయణ, నరేంద్ర రాజు, పిచ్చుక హరిబాబు, రామకృష్ణ, గంజి రాంబాబు తదితర కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులు 'పాక'ను కలిసిన బిజెపి నేత పులపర్తి



**భీమవరం, నర్సాపురం, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా పార్టీ నుండి నూతనముగా రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన పాక సత్యనారాయణని బిజెపి జిల్లాప్రధాన కార్యదర్శి పులపర్తి వెంకటేశ్వరరావు, మర్యాదపూర్వకముగా కలిశారు. గురువారం భీమవరంలోని పాక నివాసములో పుష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మారంపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

## హిందూధర్మ పరిరక్షణకు మేము సైతం.. రాష్ట్ర విప్ బొలిశెట్టి

**– ఆలయ నిర్మాణానికి రూ.15 వేలు విరాళం.**



**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్ :** తాడేపల్లిగూడెం నియోజకవర్గం రూరల్ లింగరాయుడు గూడెం గ్రామం నందు సోమలమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని రాష్ట్ర విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. బొలిశెట్టి శ్రీనివాస్ వేద, పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు నేను సైతం సిద్ధంగా ఉన్నామంటూ లింగరాయుడు గూడెం గ్రామ ప్రజలు, గుడి నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన దాతలు నిరూపించారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం సహాయార్థం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ పదిహేను రూ. 15 వేల ను అందించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అధ్యక్షుడు అంతర్వేది నరసన్న, మైనం వెంకట్రావు, కాసాని రాంబాబు, ఎలుగంటి రాంబాబు, సిద్ధ వీరన్న, అడ్డగర్ల సురేష్, చాపల రమేష్, నల్లగంచి రాంబాబు, పిడుగు రామ్మోహన్ బ్రదర్, మద్దాల మణికుమార్, ముఖేష్, గ్రామస్తులుకూటమినాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనంపై శిక్షణ



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం నందు వేసవి జ్ఞాన తరగతులలో భాగంగా గురువారం కథలుగురించి వివరించడం జరిగింది. రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్ర, తాతయ్య కథలు ,నీతి కథలు, జంతు ప్రపంచం ,పరమానంద శిష్యులు మొదలైనవి చదివించడం జరిగింది. చదవడం నాకిష్టం కార్యక్రమం జరిగింది. రిసోర్స్ పర్సన్ శాస్త్రవేత్త సుబ్బారావు పాల్గొని ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ డే సందర్భంగా రెడ్ క్రాస్ గురించి పిల్లలకు వివరించారు. 1864 మే 8న రెడ్ క్రాస్ సంస్థ స్థాపించబడింది దేశ విదేశాల్లో రెడ్ క్రాస్ సేవలు వినియో గించబడుతున్నాయి. ముఖ్యంగా మానవతవాదాన్ని మానవుల జీవితాలను ఆరోగ్యాలను కాపాడటానికి ప్రథమ చికిత్స, వైద్యశాల లు స్థాపించడం,రక్తం సేకరించడం మొదలైన సేవలు నిర్వహి స్తారని తెలిపారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జన్మదినం సందర్భంగా వారి జీవిత చరిత్ర గురించి వివరించారు .సిహెచ్ శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించారు. ఇంగ్లీష్ భాష ఉచ్చంఽణ, సి లబుల్స్ ,వకాబులరీ గురించి వివరిం చారు. చిత్రలేఖనంలో బేసిక్స్ గురించి,వేమన పద్య శతకాలు వివరించారు. రిసోర్స్ పర్సన్ రావి కృపారావు, డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్,డింపుల్ జైన్ పిల్లలకు ఫ్యాషన్ టెక్నాలజీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూర్యం బాబు, గెల్లీ శ్రీనివాస్ ,డింపుల్ జై న్ , రాజేంద్ర జువెలర్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి పర్యవేక్షించారు.

# డేవిడ్ వార్నర్ నటించిన రాబిన్‌హుడ్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్, సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు ప్రారంభం




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రేక్షకులకు ఇరవై నాలుగు గంటలు నాన్-స్టాప్ వినోదం అందించే జీ తెలుగు ఈ వారం మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలతో అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకున్న సూపర్ హిట్ సినిమా 'రాబిన్‌హుడ్'ను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందిస్తోంది. చిన్నపిల్లల్లోని నటనా ప్రతిభను వెలికితీస్తూ అశేష ప్రేక్షకాదరణతో కొనసాగుతున్న డ్రామా జూనియర్స్ 8 ఈ వారంమాతృదినోత్సవం ప్రత్యేక ఎపిసోడ్‌తో అలరించేందుకు సిద్ధమైంది. ప్రారంభం నుంచీ జీతెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న జీ తెలుగు సూపర్ సీరియల్ ఛాంపియన్‌షిప్ ఈవారం ఫినాలేకి చేరుకుంది. అంతేకాదు కుటుంబ కథతో పవన్ సాయి, అక్షిత, భావన ప్రధానపాత్రల్లో తెరకెక్కుతున్నసరి కొత్త సీరియల్ ఘరానా మొగుడు ప్రారంభం కానుంది. యాక్షన్‌ఎంట ర్టైనర్ రాబిన్ హుడ్ ఈ శనివారం సాయంత్రం 6 గంటలకు, డ్రామా జూనియర్స్ 8 మాతృదినోత్సవ ప్రత్యేక ఎపిసోడ్ రాత్రి 9 గంటలకు,సూపర్ సీరియల్ ఛాంపియన్‌షిప్ గ్రాండ్ ఫినాలే ఆదివారం రాత్రి 9గంటలకు, సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు మే 12న ప్రారంభం,సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు, మీ జీ తెలుగులో..నితిన్, దేవదత్త నాగే, శ్రీలీల, వెంకీ కుడుముల దర్శకత్వంలో,నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈసినిమాలో నితిన్, శ్రీలీల, దేవదత్త నాగే,సిజ్జు, డేవిడ్ వార్నర్ ముఖ్యపాత్రలు పోషించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించినఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మీరూ తప్పకుండా చూసే యండి. వారం వారం వినోదభరితమైన స్కిట్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న డ్రామా జూని యర్స్ 8 ఈ వారం మరో ప్రత్యేక ఎపిసోడ్తో వచ్చేస్తుంది. మాతృదినోత్సవం సందర్భంగా అనిల్ రావిపూడి తల్లి ఈ షోలో పాల్గొనను న్నారు. మరి మీరూఈ ఎపిసోడ్ని మిస్ కాకుం డా చూడండి. ఇక, ప్రతి శనివారం ఆటపాటలతో ప్రేక్షకులకు వినోదం పంచుతున్న జీతెలుగు సూపర్ సీరియల్ ఛాంపియన్‌షిప్ గ్రాండ్ ఫినాలేకు చేరకుంది. ఇక ఈ ఎపిసోడ్‌లో రోజా, మంచు లక్ష్మి పాల్గొని మరింత వినోదం పంచారు.

అంతేకాదు! జీ తెలుగు మే 12న మరో కొత్త ధారావాహిక ఘరానామొగుడు ప్రారంభిస్తోంది. ఈ సీరియల్ కుటుంబం, ప్రేమ ముఖ్య నేపథ్యాలుగా తెరకెక్కుతోంది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు జీతెలుగులో ప్రసారమయ్యే ఘరానా మొగుడు సీరియల్ మిస్ కాకుండా చూడండి.. ప్రతిభావంతులైన నటీనటులు, ఆకట్టుకునే కథతో ఘరానా మొగుడు సీరియల్ జీ తెలుగు వీక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. పవన్ సాయి, అక్షిత ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా,భావన, తేజల్, శరత్ చంద్ర, సుచిత్ర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# కిమ్స్ ఆసుపత్రిలో మాక్ డ్రిల్స్ నిర్వహణ





**అమలాపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ జిల్లాలో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తమను తాము ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించే ఉద్దేశంతో గురువారం అమలాపురం కిమ్స్ హాస్పిటల్‌లో మాక్ డ్రిల్‌ను నిర్వహించారు.భారత్, పాకిస్తాన్ మధ్య అసాధారణ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో, అత్యవసర పరిస్థితులను తట్టుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా ఫైర్ అధికారి పర్యవేక్షణలో, అమలాపురం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మురళి కొండబాబు నేతృత్వంలో జిల్లా అగ్నిమాపక శాఖ విజయవంతంగా నిర్వహించింది. మాక్ డ్రిల్‌లో హాస్పిటల్ సిబ్బంది, రోగులు మరియు ప్రజలు భాగస్వామ్యమై భవనం నుండి సురక్షితంగా బయటపడే పద్ధతులు, అగ్నిప్రమాద సమయంలో అనుసరించవలసిన జాగ్రత్తలు, అత్యవసర విరామ మార్గాల వినియోగం వంటి అంశాలపై ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. ఇలాంటి డ్రిల్లులు ప్రజల్లో అప్రమత్తతను పెంచడమే కాకుండా, విపత్తు సమయంలో వేగవంతమైన స్పందనకు తోడ్పడతాయని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు ఈ తరహా కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకుని, నేర్చుకున్న సూచనలను అమలు చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మురళి కొండబాబు, అమలాపురం, ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మాక్‌డ్రిల్‌తో ప్రజలకు అవగాహన

**- జాయింట్ కలెక్టర్ చిన్నరాయుడు**



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** ఆపరేషన్ సింధూర మాక్ డ్రిల్ నిర్వహణపై జిల్లా ప్రజలకి అవగాహన కల్పించడం జరుగుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు పేర్కొన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలో రోడ్ కం రైల్వే వంతెన వద్ద "ఆపరేషన్ సింధూర్ మాక్ డ్రిల్"అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, ఇటీవల భారత భూ భాగంలో పెహ్లగం ప్రాంతంలో పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "ఆపరేషన్ సింధూర" నేపథ్యంలో యుద్ధ పరిస్థితులు సమయంలో ప్రజలు ఎలా స్పందించాలి, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై అవగాహన కల్పించడం ముఖ్యఉద్దేశ్యం ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రయత్నం చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం పరిస్థితుల దృష్ట్యా ఎప్పటికప్పుడు సూచనలను చేస్తూ అప్రమత్తం చెయ్యడం జరుగుతుందని, బాధ్యత కలిగిన పౌరులుగా మీ భాగస్వామ్యం ఎంతో కీలకం అన్నారు. సైరన్ అల్మరింగ్ మ్రోగించడం జరుగుతుందన్నారు. వాటిని అనుసరించి సురక్షిత ప్రాంతాల్లో ఉండడం, ప్రజలు వారిని వారు రక్షించు కోవడం, ఇతరులను రక్షించడంలో భాగస్వామ్యం కావాలని పిలుపు ఇచ్చారు. విపత్తు నివారణ సమయంలో స్పందించే విధంగా యుద్ధ హెచ్చరికల నేపథ్యంలో కూడా ఒక నిర్దిష్ట సమాచారం అనుసరించి ప్రజా స్పందన కలిగి ఉండాలన్నారు. ఇటువంటి సమయంలో గాయాలు బారిన పాడిన వారికి ప్రథమ చికిత్స అందజేయడం, తరలింపు ప్రక్రియ లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజన్ అధికారి ఆర్ కృష్ణ నాయక్ , డీఎస్పీ భవ్య కిషోర్, ఆర్ఎంసి అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర రావు, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్, తదితరులు యుద్ధ హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలను, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను, స్వీయ రక్షణ కోసం చర్యలు పై ప్రజలలో చైతన్యం కలిగించే ప్రసంగాలు చెయ్యడం జరిగింది.

# ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ నిరసన



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** సాక్షి ఎడిటర్‌పై పోలీసు వైఖరి నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ గురువారం నిరసన వ్యక్తం చేసింది. దీనిలో భాగంగా మండల కేంద్రమైన ఏలేశ్వరంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా వైస్ ప్రెసిడెంట్ స్వర్ణపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాత్రికేయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. ముందస్తు సమాచారం లేకుండా ఎడిటర్ ఇంటి లోనికి ప్రవేశించి తనిఖీలు చేయడం ఎంతవరకు సమంజసమని ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్య దేశంలో పత్రికలకు ఉన్న స్వేచ్ఛను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే పాత్రికేయులపై పోలీసుల అనుచిత చర్యలు తగదన్నారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం చేరుకుని ఇన్చార్జి తాసిల్దార్ కోసరాజుకు ఈ వినతి పత్రం సమర్పించారు.

# విద్యుత్ సరఫరా అంతరాయం



**పెరవలి, మేజర్ న్యూస్ :** మల్లేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలో మే 9 వ తేదీ శుక్రవారం ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు 33 కెవి / 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల అన్నవరపాడు ఫీడర్ నందు ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం అన్నవరప్పాడు గ్రామమునకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో కోరారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) విస్తృత స్థాయి సమావేశం రాపర్తి రోడ్డులో గల సంఘం కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దేగల సత్యనారాయణ, అధ్యక్ష కార్యదర్శులుగా పప్పుల వీరబాబు ఒమ్మి గోవిందు, ఉపాధ్యక్షుడిగా వి బాబ్జి, సహాయ కార్యదర్శిగా గోపాలపు సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాయుడు సత్యనారాయణ, సహాయ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గాది కోటేశ్వరరావు , ట్రెజరర్ దంట్ల గోపాలకృష్ణ, సహాయ ట్రెజరర్ వనము శ్రీను, కమిటీ సభ్యులుగా ఎం సత్యనారాయణ, కె పెద్దకాపు,జి శ్రీను,బి లచ్చ,ఎస్ శివ,జి లోవరాజు,ఎ చక్రకుమార్,ఎస్ శ్రీను,వి కనకారావు,ఎ శ్రీను,పి కృపలను ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు కొనసాగించాలని, పెండింగ్ లో ఉన్న క్లైములు విడుదల చేయాలన్నారు. ప్రతి ఒక్క కార్మికుడికి సంఘం తరపున అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో పలువురు భవన నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు.